పారదర్శకంగా ఓటరు జాబితా

కలెక్టర్ టీఎస్ దివాకర

నాయకులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగురూరల్, సెప్టెంబర్ 18 : రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు పారదర్శకంగా ఓటరుజాబితాను రూపొందిస్తామని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ సంపత్ రావుతో కలిసి సమీక్షించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13న ఓటరు ముసాయిదా జాబితా ప్రచురించినట్లు తెలిపారు. జాబితాపై 21వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. నేడు మండల స్థాయిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారని తెలిపారు. 28న వార్డుల వారీగా తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులందరి ఓటు ఒకే పోలింగ్ కేంద్రం, వార్డులో ఉండే విధంగా చేపట్టిన ప్రక్రియతోపాటు మ్యాపింగ్ ప్రక్రియను 100శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు ఓటరు జాబితా తయారీలో అభ్యంతరాలు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కారం చూపాలని అన్నారు. జిల్లాలో 9మండలాల పరిధిలో 174 జీపీల పరిధిలో 1556 వార్డులు ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి అజాగ్రత్తకు తావ్వికుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చూడాలని అన్నారు. డీపీవో దేవరాజ్, నాయకులు పాల్గొన్నారు.

జాబితాలో అభ్యంతరాలు తెలుపండి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 18 : ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితాలో అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు తదితర అంశాలపై రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. శాసనసభ ఎన్నికల ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని గ్రామ పంచాయతీ ఓటరు జాబితాను ప్రకటించినట్లు చెప్పారు. జిల్లాలో 240 గ్రామ పంచాయతీలు, 2,044 వార్డులు ఉన్నట్లు తెలిపారు. పురుషులు 1,42,217 మంది, మహిళలు 1,48,432 మంది, ఇతరులు 14 మంది, మొత్తం 2,90,663 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 19న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు ముందుగానే తమ ఓటును పరిశీలించి అభ్యంతరాలుంటే తెలియచేయాలని తెలిపారు. ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, వాటిపై జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ఈ నెల 26న తుది నివేదిక సమర్పిస్తారని వివరించారు. సెప్టెంబర్ 28న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని, తరువాత ఎలాంటి మార్పులు చేర్పులకు అవకాశం ఉండదన్నారు. మార్పులు, చేర్పులకు మంథని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి, భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో భూపాలపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్డీవోకు దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు పాల్గొన్నారు.

రాంబాబు మృతి తీరని లోటు : బడే నాగజ్యోతి

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాగజ్యోతి

ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 : మండలంలోని శివ్వాపూర్ మాజీ సర్పంచ్, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు యాలం రాంబాబు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృత దేహంపై పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియ ల్లో నాగజ్యోతి పాల్గొన్నారు. మరణ వార్త తెలుసుకున్న నాగజ్యోతి భావోద్వేగానికి లోనయ్యారు. రాంబాబు మృతి పార్టీకి తీరని లోటనిఅన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఎట్టి జగదీశ్, మాదిరి రామయ్య, గోస్కుల రాంబాబు, కాళ్ల రామకృష్ణ, ఏనుగు మహేశ్, పెంచికల లక్ష్మీనారాయణ, సిద్ధబోయిన రాంబాబు, మెట్టకంటి సమ్మిరెడ్డి, పుష్ప, ఈసం సారయ్య, రంజిత్, వాసం అరుణ, ఏనాల మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, కుమ్మరి చంద్రబాబు, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

CHANGE OF NAME
I, the undersigned KATTEKOLA VENKATRAMA RAO (New Name) Previously called KATTEKOLA VENKATRAM RAO (Old Name) and Residing at H.No. 2-12-294/1, Vidyaranyapuri, Opp: KUC 2nd Gate, Hanumakonda Dist.-506009, T.S., India Solemnly declare.

CHANGE OF NAME
I, ABDUL MASOOD MOHD S/o ABDUL HUSSAIN (New Name) previously called ABDUL MASOOD S/o ABDUL HUSSAIN (Old Name) and Residing at H.No. 15-2-368, Rangampeta, Warangal District-506 007, T.S., India, and solembly declare.

WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K.
9160900024 / 9640400073.
NT-331771-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

విద్యార్థులు, అధికారులతో కలిసి స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్

మహదేవపూర్ (కాటారం)/ మహముత్తారం, సెప్టెంబర్ 18 : గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కాటారం, మహాముత్తారం మండలాల్లో పర్యటించారు. కాటారం మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం ముగిసినందున పారిశుధ్య పనులు చాలా ఆవశ్యమన్నారు. మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో వారంలో రెండు రోజులు పర్యటించి తనిఖీలు చేస్తూ పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలు, సబ్ సెంటర్లు, ఆశ్రమ పాఠశాలలు, జీపీ భవనాలు, ప్లాంటేషన్, కంపోస్ట్ షెడ్, వైకుంఠధామాలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఆరుబయట వ్యర్థాలను కాలిస్తే చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. మిషన్ భగీరథ వాటర్ సరఫరాను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అమ్మ పేరున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులను సత్కరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ క్యాక్రమంలో పాల్గొని విద్యార్థులు, అధికారులతో కలిసి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు ఆయన సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డుల గది, సిబ్బంది గదులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మహాముత్తారం మండలంలోని మోడల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి భోజనం, కూరలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. 272 విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలుపగా గైర్హాజరు చాలా మంది ఉన్నారని, ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భూపాలపల్లి నుంచి విద్యార్థులు వస్తుంటారని బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తరచూ గైర్హాజరు అవుతున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని, చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలుపగా డీఈవోతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పీహెచ్‌సీని సందర్శించి క్యాజువాలైటి, డ్రగ్ స్టోర్, వాక్సిన్లు భద్రపరిచే గది, ఫ్రిజ్, రక్త పరీక్షలు నిర్వహించే గది, ఓపీ రిజిస్ట్రర్‌ను కలెక్టర్ పరిశీలించారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించా రు. ఇప్పటి వరకు ఎన్ని డెంగ్యూ కేసులు నమోదయ్యాయని అడగగా ఒకటి వచ్చినట్లు వారు బదులిచ్చారు. వ్యాధులు ప్రబలిన ప్రాంతాల్లో జ్వర సర్వే నిర్వహించాలన్నారు. పాము, కుక్క కాటు తదితర వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణ రావు, డీఎల్‌పీవో వీరభద్రయ్య, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, మహాముత్తారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ షరీఫ్, వైద్యులు సుధీర్, సందీప్, జీపీ ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌చరణ్‌కు సన్మానం

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 18 : సివిల్ ఇంజినీరింగ్ పరీక్షలో స్టేట్ ఫస్ట్ వచ్చిన పల్నాటి రామ్‌చరణ్‌ను బుధవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు. కేటీకే-1 ఇంక్లైన్‌లో ఎలక్ట్రికల్ ఫోర్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న యుగంధర్ కుమారుడు రామ్‌చరణ్ సింగరేణి కంపెనీ జూలై 20న సివిల్ ఇంజినీర్ పరీక్ష రాయగా మంగళవారం రాత్రి ప్రకటించిన ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. బుధవారం సత్యనారాయణ రామ్‌చరణ్ ఇంటికి వెళ్లి శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కోటంచకు బ్రహ్మానంద సరస్వతి

రేగొండ, సెప్టెంబర్ 18 : కోటంచ లక్ష్మీనరసింహస్వామిని నైమిశరణ్య పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతి బుధవారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు, ఈవో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం పీఠాధిపతి భక్తులకు ప్రవచణాలు వినిపించారు. ఈవో మహేశ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

రుణమాఫీ చేయాలని మంత్రికి వినతి

ములుగురూరల్, సెప్టెంబర్ 18 : రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా కన్వీనర్ ఎండీ అమ్జద్‌పాషా మాట్లాడుతూ రాష్ట్రంలోని పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలన్నారు. లావాన్ పట్టా భూములకు పంట రుణాలు అందించాలన్నారు. గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు మామిడి నట్రాజ్, దేవిరెడ్డి వెంకట స్వామిరెడ్డి, వెంకట్రామ్, తోట శాంతమ్మ, కొయ్యడ లక్ష్మి ఉన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

చిట్యాల, సెప్టెంబర్ 18 : పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని సీడీపీవో అవంతి, ఒడితల పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం మండలంలోని చైన్‌పాక, దూత్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ మేళా నిర్వహించారు. పిల్లల ఎత్తు, బరువు పరిశీలించారు. సూపర్‌వైజర్ జయప్రద, హెచ్‌ఈవో సంజీవరెడ్డి, ఏఎన్ఎం పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ మండల కమిటీ ఎన్నిక

గోవిందరావుపేట, సెప్టెంబర్18 : ఎన్‌హెచ్‌ఆర్సీ మండల కమిటీని బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధక్షుడు పెట్టెం రాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా దేవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఎలగందుల వెంకటేష్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వంగరి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా కొండి రమేశ్, అధికార ప్రతినిధిగా ఎండీ అక్బర్‌ను నియమించి నియామకపత్రాలను అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు రాజేందర్, ఎన్నికల ఇన్‌చార్జి ములుగు పట్టణ అధ్యక్షుడు కొడిపాక రవి, అధికార ప్రతినిధి తిప్పని కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ.. తప్పిన ప్రమాదం

మంగపేట, సెప్టెంబర్ 18 : మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో బుధవారం ఎల్‌టీ విద్యుత్ లైన్‌కు చెందిన తీగ తెగి కిందకు వేలాడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ అటు వైపునకు ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎన్పీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం తెగిన చోట అవసరమైన మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

వైద్యం చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్, వైద్యసిబ్బంది

వాగులు వంకలు దాటి వైద్య సేవలు


కాలినడకన వెళ్తున్న వైద్యసిబ్బంది

వెంకటాపూర్, సెప్టెంబర్ 18 : సీజనల్ వ్యాధులపై గొత్తికోయలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని తొర్రిచింతల పాడు గొత్తికోయ గూడెంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కాగా మండల కేంద్రానికి 8కిలో మీర్ల దూరంలో తొర్రిచింతలపాడుకు ట్రాక్టర్ సహాయంతో కొంతదూరం ప్రయాణించి, కాలినడకన వాగులు, వంకలు దాటి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శోభ, వెంకట్‌రెడ్డి, అనురాధ, స్వప్న, వజ్రమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్‌ట్యాంకు

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

వెంకటాపూర్, సెప్టెంబర్ 18 : పాలంపేట గ్రామంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి, కూలిపోయే స్థితిలో ఉందని గ్రామస్తులు తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరుగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి తోడు గత పదేళ్లుగా ట్యాంకును క్లోరినేషన్ చేయకపోవడం, కడగక పోవడంతో చర్మవ్యాధులు వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ట్యాంకు శిథిలావస్థలో ఉంది నిజమేనని, గ్రామంలో నీటిని సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన ట్యాంకు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

గోరికొత్తపల్లిని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే జీఎస్‌ఆర్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీఎస్‌ఆర్

రేగొండ, సెప్టెంబర్ 18 : కొత్తగా ఏర్పడిన గోరికొత్తపల్లి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. తహసీల్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణానికి రూ.3.20కోట్లు మంజూరు కాగా, బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తాను ప్రజా సేవకుడిని మాత్రమేనని, తన వెంట తిరిగే నాయకులు తప్పు చేసినా సహించేదిలేదన్నారు. మండలంలో ఇప్పటి వరకు రూ.55 లక్షలతో సీసీ రోడ్లు, రూ.3.20 కోట్లతో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. త్వరలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రూ.176 కోట్లతో గోరికొత్తపల్లి నుంచి శాయంపేటకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. తిరుమలగిరి నుంచి జగ్గయ్యపేటకు, సుల్తాన్‌పూర్ నుంచి బుగులోని జాతరకు రూ.50 కోట్లుతో రోడ్డు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, నాయకులు సూదం ఓంప్రకాశ్, నర్సయ్య, ఉమేశ్‌గౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

ధ్వంసమైన అడవిని పరిశీలించిన పొదెం వీరయ్య

నేలమట్టమైన చెట్లను పరిశీలిస్తున్న పొదెం వీరయ్య

తాడ్వాయి, సెప్టెంబర్ 18 : గత నెల 31న సుడిగాలి సృష్టించిన బీభత్సంలో మేడారం అటవీ ప్రాంతంలోని చెట్లు నేలకూలగా బుధవారం ఆ ప్రాంతాన్ని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య పరిశీలించారు. అడవిలో కొంత దూరం వరకు నడుచుకుంటూ వెళ్లి నేలకూలిన చెట్లను పరిశీలించారు. అటవీశాఖ అధికారులు నేలకూలిన అటవీ ప్రాంతాన్ని ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా ఆయన పరిశీలించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ విషయాన్ని సీఎం, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ధ్వంసమైన ప్రాంతంలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్నారు. గద్దెల వద్ద గిరిజన సంప్రదాయ పద్ధతిలో పూ జలు చేశారు. ఆయన వెంట చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ప్రభాకర్, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్‌జాదవ్, అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు ఉన్నారు.

భూమితో మాధవరావుకు సంబంధం లేదు

- **హక్కుదారులం మేమే**
- **అజ్మీరా జ్యోతి రమేశ్ నాయక్ దంపతులు**


వివరాలు వెల్లడిస్తున్న జ్యోతీరమేశ్ నాయక్ దంపతులు

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 18 : భూపాలపల్లి మండలం కొంపెల్లి పరిధి సర్వే నంబర్లు 75/1, 75/అ, ఇ, ఈ లోని మూడు ఎకరాల భూమికి ఎమ్మెల్యే బామ్మర్ది మాధవరావుకు ఎలాంటి సంబంధంలేదని, హక్కుదారులం తామేనని పుల్లురిరామయ్యపల్లికి చెందిన అజ్మీరా జ్యోతి, రమేశ్‌నాయక్ దంపతులు అన్నారు. బుధవారం వారు ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ అజ్మీరా భద్రూనాయక్ 1995లో కొంపల్లి తండాకు చెందిన గుగులోత్ నర్స నాయక్ వద్ద మూడు ఎకరాల భూమి కొనుగోలు చేశాడని, అప్పటి నుంచి తామే కాస్తులో ఉన్నామన్నారు. ఈ క్రమంలో 2018 నుంచి కొంపెల్లి తండాకు చెందిన గుగులోత్ నర్సనాయక్ కొడుకు వాలునాయక్ ఈ భూమి నాదేనని, ఇక్కడికి వస్తే తమ కుటుంబాన్ని చంపేస్తానని బెదిరిస్తూ దాడులు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ భూమి విషయమై కోర్టులో కేసు వేస్తే ఇంజక్షన్ ఆర్డర్ తమకే వచ్చిందని తెలిపారు. అయినా వాలునాయక్ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు విచారణ చేసి తమదేనని తేల్చారన్నారు. భూమి విషయంలో ఎమ్మెల్యే బామ్మర్ది మాధవరావు ప్రమేయం ఉందని తప్పుడు ప్రచారం చేస్తునాడని ఆరోపించడం సరికాదన్నారు. ప్రభుత్వం జారీ చేసిన పట్టా పాస్ పుస్తకం కూడా ఉందని తెలిపారు. వాలునాయక్‌తో పాటు ఆయన అనుచరుడు సురేశ్‌తో ప్రాణభయం ఉందని, వారి నుంచి తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఘనంగా కొత్తల పండుగ

బాలకుమారస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఆదివాసీలు

ములుగురూరల్, సెప్టెంబర్ 18 : ములుగు మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో ఆదివాసీలు బుధవారం కొత్తల పండుగ, పెద్దల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీల పొలాల్లో పండించిన మక్కజొన్న కంకులు, దోసకాయలు, కూరగాయలు, వరి పొట్టలు మొ దలైనవి పాన్పు రుణంలో గ్రామంలోని బాలకుమారస్వామి ఆలయం వద్దకు చేర్చారు. ఆచారాల ప్రకారం గోత్రం ప్రకారం వరి పొట్టలతో కటినట దోర్నాలను 3,4,5,6,7గొట్టు వారు తయారు చేశారు. బాలకుమారస్వామికి, కొలకాడ, సడలమ్మ, సమ్మక్క, దూలిముత్తికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి సమూహంగా దళిపతి ఇంటి వద్ద వండించిన భోజనాన్ని ఆరగించారు. సాయంత్రం ప్రతి ఇంట్లో పెద్దలను స్మరించుకోవడంతోపాటు కొత్తగా పెండ్లి చేసుకున్న వధువులు భర్త ఇంటి పేర్లను స్మరించేందుకు కుల పెద్దలను పిలిచే కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ పండుగలో గ్రామస్తులు డీఎంహెచ్ఎవో డాక్టర్ అల్లెం అప్పయ్య, గ్రామస్తులు ఈక కృష్ణ, చింత శ్యామల, నారాయణ, అర్రం సారంగపాణి, పాపయ్య, అల్లం భాస్కర్, అల్లం బాయికాడ రామయ్య పాల్గొన్నారు.

'దళిత బంధు' నిధులు విడుదల చేయాలి

ములుగురూరల్/ఏటూరునాగారం/మంగపేట, సెప్టెంబర్ 18 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెండో విడత దళిత బంధు లబ్ధిదారులకు నిధులను విడుదల చేసి ఈ పథకాన్ని కొనసాగించాలని రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు కోగిల మహేశ్, కోఆర్డినేటర్ మడికొండ రమేశ్, లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారం, మంగపేట మండలం రాజుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దళిత బంధు పథకం యూనిట్లను పంపిణీ చేయడం హర్షణీయమని భట్టికి ధన్యవాదాలు తెలిపారు. రూ.2వేల కోట్లు దళిత బంధు పథకానికి కేటాయించినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి సీతక్క ప్రకటించారని, వెంటనే ఆ నిధులను రెండో విడత లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. మాదిరి రాంబాబు, కుమ్మరి చంద్రబాబు, బోడ సారయ్య, దేపాక శ్రీరామ్, కాళ్ల రామకృష్ణ, జూపాక నవీన్, వావిలాల ప్రభాకర్, వావిలాల రాంనర్సయ్య, రాజుపేటలో బియ్యం శ్రీను, శ్యాంబాబు, సుకుమార్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ట్రయల్ రన్‌లో సూపరింటెండెంట్, వైద్యులు

ప్రభుత్వ దవాఖానకు సింగిల్ డోనర్ ప్లేట్‌లేట్ మిషన్

ట్రయల్ రన్ చేసిన వైద్యాధికారులు

ములుగురూరల్, సెప్టెంబర్ 18 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు అధునాతన సింగిల్ డోనర్ ప్లేట్‌లేట్ మిషన్ విచ్చేసింది. ఇందులో భాగంగా బుధవారం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, వైద్య బృందం మిషన్ ఇన్‌స్టాలేషన్ చేసి ట్రయల్ రన్ చేశారు. జ్వరాల బారిన పడి తెల్ల రక్త కణాలు లేని రోగులకు ఒకే బ్లడ్ గ్రూప్‌నకు చెంది తెల్ల రక్త కణాలు కలిసే సింగిల్ డోనర్ తన తెల్ల రక్త కాణాలను అందిస్తే ఆపదలో ఉన్న వారికి ఈ మిషన్ ద్వారా ఎక్కించనున్నారు. ఈ మిషన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ములుగు జిల్లా ప్రజలకు వైద్యం మరింత మెరుగ్గా అందనున్నది. ఈ ట్రయల్ రన్‌లో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ చంద్రశేఖర్, వైద్యులు సంధ్య, కిశోర్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ నివేదితరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మంత్రి హామీతో సమ్మె విరమణ

ములుగురూరల్, సెప్టెంబర్ 18 : ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ కార్మికులకు వేతనాల విషయమై నేడు చేపట్టిన సమ్మెను విరమించుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ యూనియన్ నాయకులతో చర్చించి ఫైనాన్స్ అధికారులతో మాట్లాడి బడ్జెట్‌ను రిలీజ్ చేసినందుకు సమ్మె విరమణ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

దేవాదుల పంపింగ్ ప్రారంభం

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 18 : దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేస్-3లోని ఒక మోటర్‌తో బుధవారం గోదావరి నీటి పంపింగ్ ప్రారంభించారు. ఆగస్టు 24న పంపింగ్ బంద్‌చేయగా తిరిగి 25 రోజుల తర్వాత పునః ప్రారంభించారు. ఒక మోటర్ ద్వారా రోజుకు 292 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌కు తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

సమ్మక్క బరాజ్ వద్ద తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. బుధవారం ఎగువ నుంచి 1,87,500 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బరాజ్ మొత్తం 59 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బరాజ్ పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్లు, ప్రస్తుతానికి గోదావరి నీటిమట్టం 75.40 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

రోడ్డు పనులు పూర్తి చేయాలని రాస్తారోకో

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 18 : మండలకేంద్రం నుంచి ఎదిర వరకు ఉన్న ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతూ రామచంద్రాపురం గ్రామస్తులు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పనులు ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నా కాంట్రాక్టర్ నేటి వరకు రోడ్డు పనులు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీకి మండల అధ్యక్షుడి రాజీనామా

జీ సాంబయ్య

గణపురం, సెప్టెంబర్ 18 : బీజేపీ మండల అధ్యక్షుడు జిట్టబోయిన సాంబయ్య యాదవ్ బుధవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, మండల అధ్యక్ష పదవికి బుధవారం రాజీనా మా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, అయినా పార్టీలో తగిన గుర్తింపు లేదని ఆవేదన చెందారు. ఎన్నికల్లో ఓటు బ్యాంకు పెంచేందుకు కృషి చేశానని, బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు పార్టీ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకుండా ఉన్నత సామాజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ కించపరుస్తున్నారన్నారు. స్వార్థ ప్రయోజనాలతో పని చేస్తున్న ఉన్నత వర్గానికి చెందిన నాయకుడిపై ఫిర్యాదు చేసినా క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదన్నారు. గుర్తింపు లేని పార్టీలో ఉండేకన్నా బయటికి రావడమే మేలని రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 18 : అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మొగుళ్లపల్లి మండలం వేములపల్లి శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివరాలు సేకరిస్తుండగా డ్రైవర్లు పరారీలో ఉన్నారని దర్యాప్తులో వరికోల్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం కిరణ్, బొగ్గెల వీరన్నగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇద్దరిపై కేసు

రేగొండ : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా మడుత్తపల్లిలో నిల్వ చేసిన ఇసుకను లారీలో నింపుకొని వెళ్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి ఓనర్ పట్టెం శంకర్, డ్రైవర్ కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వన్యప్రాణులను వేటాడిన వారిపై కేసు

వెంకటాపూర్, సెప్టెంబర్ 18 : వన్యప్రాణులను వేటాడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో డోలి శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రామంజపూర్ పరిధి చెంచుకాలనీలో అడవి పందులను వేటాడి కాల్చుతున్నారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. ముగ్గురు వ్యక్తులు వాటిని కాలుస్తుండగా పట్టుకొని విచారించినట్లు తెలిపారు. కరెంటు తీగల సాయంతో పందులను హతమార్చినట్లు తెలిపారు. వేటకు ఉపయోగించిన బైండింగ్ వైరు, కత్తులు, క్లచ్ వైర్లను స్వాధీనం చేసుకొని ఇండ్ల రవి, ఇండ్ల సారయ్య, అవుల వాసుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. డిప్యూటీ ఎఫ్ఆర్వో మధుబాబు, ఎఫ్‌బీవోలు పులేందర్, కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

విషజ్వరంతో మహిళ మృతి

వెంకటాపూర్, సెప్టెంబర్ 18 : మండలంలోని రామంజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుంటూరుపల్లికి చెందిన బండి రమ(43) విషజ్వరంతో మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రమకు ఐదు రోజుల క్రితం జ్వరం రాగా హనుమకొండలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త భద్రయ్య రెండేళ్ల క్రితం వడదెబ్బతో మృతిచెందాడు. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా కిడ్నీల వ్యాధితో రమ మృతిచెందిందని, విషజ్వరంతో కాదని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మంగపేట, సెప్టెంబర్ 18 : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై టీవీఆర్ సూరి కథనం ప్రకారం కోమటిపల్లి గ్రామానికి చెందిన ఊడుగుల రాకేశ్(20) కొంత కాలంగా ముభావంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఈనెల 16న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ రాకేశ్ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తాత ఊడుగుల ఎల్లయ్య బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.